క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కొందుర్గు: కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ జంగయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతారని, మండల స్థాయిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఆర్థికసాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన రాములమ్మ (73) అనారోగ్యానికి గురై సోమవారం మృతి చెందింది. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్, ఉప సర్పంచ్ అజీజ్, ఎంపీటీసీ అంబాజీ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అజీజ్ వ్యక్తిగతంగా రూ.1500, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి రూ.3000, శ్రీనివాస్ యాదవ్ రూ.3000, ఎంపీటీసీ అంబాజీ రూ.1000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు.. లింగం, రాజు, రవి, అభిలాష్, యాదయ్య, నర్సింహ, అంజి, పరంధాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: సీఎంఆర్‌ఎఫ్ పథకం నిరుపేదలకు వరమని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కుమ్మరి శంకర్ అన్నారు. మండల పరిధిలోని దేవునిపడకల్‌కు చెందిన అరుణమ్మకు రూ.75,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు శంకర్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతి, పడకల్ రైతు సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్, విద్యా కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ రవి, సత్యం, రామకృష్ణ, రామస్వామి, వెంకటేష్, రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వం

సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి



నీటి సరఫరాను పరిశీలిస్తున్న సర్పంచ్

కడ్తాల్: ప్రజలకు తాగునీటి అవసరాలకు ఇబ్బందులకు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మిషన్ భగీరథ పథకం ద్వారా గృహాలకు అందించే నీటి సరఫరాను ఉప సర్పంచ్ రామకృష్ణతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రంలో తాగునీటి ఇబ్బందులు కలగకుండా మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా కొనసాగుతుందని తెలిపారు. సాయిరామ్‌నగర్ కాలనీలో ఇటీవలే లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించామన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని 3, 12 వార్డుల్లో త్వరలోనే లక్ష లీటర్ల ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు నీటివృథాను అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచంద్రయ్య, కిరణ్ ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



మందులు అందిస్తున్న వైద్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఏపీఎస్ క్లినిక్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరంలో వైద్యులు తాహిర్, సాధనారెడ్డి, జునైద్ అహ్మద్, అరవింద్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు అందించారు. అవసరమైనవారికి రక్తపరీక్షలు నిర్వహించారు. ఏపీఎస్ క్లినిక్ నిర్వాహకులు శేఖర్, సిబ్బంది నవీన్, శివ, అలివేలు, రేవతి, శైలజ పాల్గొన్నారు.

అమ్మ,నాన్న, గురువు పద్యార్చన



పద్యార్చనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంచాల: మంచాల మండల పరిధిలోని ఆరుట్ల మోడల్ స్కూల్‌లో 'అమ్మానాన్న గురువు పద్యార్చన' కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) వంద దేశాలల్లో ఉన్న తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వ మాతరమ్ పేరుతో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా ఆరుట్ల మోడల్ స్కూల్‌లో విద్యార్థులు చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం, నాన్న శతకం, గురువు శతకాల్లో పద్యాలను 150 మంది విద్యార్థులు సామూహిక గానం చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయురాలు ఉషారాణి,పారిజాత,సరిత పాల్గొన్నారు.

ఆదాయం సరే.. సౌకర్యాలేవి?

- మాల్ పశువుల సంతకు సొంత స్థలం కరువు
- రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా పట్టించుకోని జీపీ పాలకవర్గం
- సౌకర్యాల లేమితో క్రయ, విక్రయాలకు ఇబ్బంది



మాల్‌లోని ప్రైవేట్ వెంచర్లో కొనసాగుతున్న పశువుల సంత

యాచారం: మాల్‌లోని పశువుల సంత స్థల ఎంపికకు గ్రహణం వీడటం లేదు. ఏళ్లు గడిచినా స్థలం ఎంపిక చేయకపోవడంతో ప్రైవేట్ వెంచర్లల్లోనే పశువుల సంతను కొనసాగిస్తున్నారు. రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దులోని మాల్‌లో ప్రతి మంగళవారం పశువుల సంత కొనసాగుతోంది. ఈ సంతలో తక్కువ ధరలకు అరక దున్నె కొడెలు, ఎద్దులు, ఆవులు, పాడి పశువులు దొరుకుతుండటంతో మాల్ పశువుల సంతకు భలే క్రేజ్ ఉంటుంది. ప్రతి మంగళవారం రంగారెడ్డి జిల్లాలోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, కందుకూర్, కడ్తాల్, ఆమన్‌గల్, మాడ్గుల్, నల్లగొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ, దేవరకొండ తదితర మండలాల నుంచి వేలాదిగా పశువులను క్రయ, విక్రయాలకు తీసుకువస్తారు. వందలాది మంది వ్యాపారులు.. పశువుల క్రయవిక్రయాలతో వ్యాపారులు కూడా మంచి ఆదాయం పొందుతారు. రైతులకు కూడా సరసమైన ధరలకు పశువులు దొరుకుతుండటంతో వాటిని కొనేందుకు వేల సంఖ్యలో సంతకు వస్తుంటారు.

విశాలమైన స్థలమున్నా..

ప్రస్తుతం కొనసాగుతున్న పశువుల సంత పక్కనే సర్వే నంబరు 640లో 16ఎకరాల 20గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో నుంచి 5 ఎకరాలు సంతకు కేటాయించాలని పలుమార్లు స్థానికులు అధికారులను కోరినా ఫలితం లేకుండా పోతోంది. మాల్‌లో పశువుల సంతకు ఎకరా భూమి ఉన్నప్పటికీ పూర్తిగా కబ్జాకు గురైంది. ఎకరా భూమి చుట్టూ ఇంటి నిర్మాణాలు కావడంతో గుర్తించే అవకాశం లేకుండా పోయింది. వెంచర్లల్లో పశువుల క్రయ, విక్రయాలు జరపడంతో తాగునీటి ఇబ్బందులు, ఎండ, వర్షాలు కురిసినప్పుడు నీడ ఉండటం లేదు. దీంతో సంతకు వచ్చిన రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ వెంచర్లల్లో తాత్కాలికంగా టెంట్లు వేసి గ్రామ పంచాయతీ ఆదాయాన్ని దుబారా చేస్తున్నారు. ప్రైవేట్ వెంచర్లల్లో పశువుల క్రయ, విక్రయాలు జరపడంతో పన్నులు వసూల్ చేయడం కూడా వేలంపాట సిబ్బందికి కష్టంగా మారింది.

వేలం ద్వారా మాల్ జీపీకి వస్తున్న ఆదాయం

ఏడాది	రూ. లక్షల్లో
2019–20	41
2020–21	52
2021–22	53
2022–23	63
2023–24	71

మాల్ అభివృద్ధి అంతా..

ఏళ్లుగా మాల్ గ్రామాభివృద్ధి మొత్తం పశువుల సంత ద్వారా వచ్చిన ఆదాయంతోనే జరుగుతుంది. ఈ సంత నిర్వహణ వేలంపాట ద్వారా వచ్చే ప్రతియేటా మాల్ గ్రామ పంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. పదేళ్లుగా సంత ఆదాయం దాదాపు పదిరెట్లు పెరిగింది. సంత నిర్వాహణ వేలంపాటతో వచ్చిన ఆదాయంతోనే మాల్ గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, వివిధ అభివృద్ధి పనులు, పంచాయతీ సిబ్బందికి జీతాలు, ఇతర ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి. అయితే సంతలో అన్ని సౌకర్యాలు కల్పిస్తే మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా పంచాయతీ పాలకవర్గం దృష్టి పెట్టడంలేదంటూ విమర్శలున్నాయి.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



మాల్ పశువుల సంత స్థలం కేటాయింపు కోసం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాస్తా. నిజానికి సంతకు శాశ్వత స్థలం లేకపోవడంతో పశువుల క్రయ, విక్రయాల్లో ఇబ్బందులు పడుతున్నామని గ్రామ పంచాయతీ పాలకవర్గం పలుమార్లు ఫిర్యాదు చేసింది. పక్కనే ఉన్న సర్వే నంబరు 640లో 5ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించే విధంగా కృషిచేస్తా. పశువుల సంత ఆదాయంతో మాల్ గ్రామ పంచాయతీ చాలా అభివృద్ధి చెందింది. సంతలో సరైన సౌకర్యాలు కల్పిస్తే మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ, యాచారం

రోడ్డు విస్తరణ పనులు చేపట్టండి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని స్నేహపురి కాలనీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్‌పర్సన్ హరితను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన చైర్‌పర్సన్.. వచ్చే బడ్జెట్‌లో చేర్చి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాంరెడ్డి, ఉపాధ్యక్షులు గౌరి శంకర్, నాయకులు బొక్క వంశీధర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కరాటేలో ఆమనగల్లు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

ఆమనగల్లు: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన బండారి శాంతికుమార్ కప్ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఆమనగల్లు పట్టణానికి చెందిన లిటిల్ స్కాలర్స్ టెక్నో హైస్కూల్ విద్యార్థులు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చి నాలుగు బంగారు, ఏడు రజత, నాలుగు కాంస్య పతకాలు సాధించారని హెడ్‌కోచ్ మాస్టర్ సోను సోమవారం తెలిపారు. విజేతలకు ముఖ్య అతిథి బండారి శాంతకుమార్ పతకాలు అందించారు. ఈ పోటీల్లో అశోక్, చరణ్, చరణ్య, అభినేత్, రిషి, దార్విక, లోకేశ్, క్రిష్, సాయితనూజ, రూపక్, బంటి వివిధ పతకాలను సాధించారు. విద్యార్థులను లిటిల్ స్కాలర్స్ టెక్నో హైస్కూల్ చైర్మన్ అల్లాజీగౌడ్ అభినందించారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవునిపడకల్ శ్రీవేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం 5 గంటలకు అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి, అర్చకులు రామాచారి, పద్మనాభం, ఆలయ క్లర్క్ ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ కిట్ పంపిణీ చేస్తున్న రాఘవేందర్

కడ్తాల్: విద్యార్థులు, యువకులు చదువతో పాటు క్రీడారంగంలో రాణించాలని తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ అన్నారు. సోమవారం కడ్తాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకరులకు క్రికెట్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని, యువత క్రీడారంగంపై దృష్టి సారించాలని సూచించారు. నాయకులు దాస్, రాఘవులు, ప్రశాంత్, మురళి, భాస్కర్, సాయి, శివ,అంజి, కరుణాకర్, శ్రీను ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కావడి మహోత్సవం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని శ్రీ బంగారు మైసమ్మ కాశీ విశ్వనాథ దేవాలయంలో సోమవారం వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి షష్ఠిని పురస్కరించుకుని కావడి మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో కావడి మోస్తూ సుబ్రమణ్య స్వామి మొక్కులు తీర్చుకున్నారు. కావడిలో పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, తేనె, జీడిపప్పు లాంటి ద్రవ్యాలతో కూడిన ప్రసాదాలను స్వామివారికి సమర్పించారు. వందలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, ఆలయ ఫౌండర్ ట్రస్టీలు బాలకిషన్, అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

'రేషన్'పై పర్యవేక్షణేది?

- విజిలెన్స్ కమిటీల మాటేలేదు
- హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీలకు నాసిరకం సరుకుల సరఫరా
- రోగాలబారిన పడుతున్న విద్యార్థులు, చిన్నారులు



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

మహేశ్వరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీ పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన విజిలెన్స్ కమిటీలు నామమాత్రమయ్యాయి. పర్యవేక్షణకు డివిజన్, మండల స్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసి.. ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై బియ్యం నాణ్యత పంపిణీ తీరు, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారం తదితర అంశాలపై చర్చించాలి. పంపిణీ, అందించడంలో లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. అయితే డివిజన్, మండల స్థాయిలో కమిటీలే ఇంకా ఏర్పాటు కాలేదు. పర్యవేక్షణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొనసాగిన ఆహార సలహా సంఘాలను తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దుచేసి విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. అయితే గత బీఆర్‌ఎస్ హయాంలో డివిజన్, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయకపోవడంపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. కొత్త ప్రభుత్వంలోనైన కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కమిటీలు ఇలా...

జిల్లా స్థాయి కమిటీలకు కలెక్టర్, డివిజన్ స్థాయి కమిటీకి ఆర్డీఓ, మండల స్థాయి కమిటీకి తహసీల్దార్ చైర్మన్లుగా ఉంటారు. మండల స్థాయిలో ఎంపీపీ సహ చైర్మన్‌గా ఉంటారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు ముగ్గురు మహిళా ప్రతినిధులు, ఎంపీడీఓ, వ్యవసాయాధికారి, ఇద్దరు జర్నలిస్టులు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు రైతులు, రేషన్ డీలర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి, రాజకీయ పార్టీల నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు.

సరుకుల నాణ్యతపై ఆరోపణలు...

కమిటీల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత ప్రమాణాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలకు నాణ్యతలేని రేషన్ బియ్యం, సరుకులు సరఫరా అవుతుండటంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని పెద్దఎత్తున ఫిర్యాదుల వచ్చాయి. కమిటీలు లేకపోవడంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం గురించి పట్టించుకునేవారు లేకుండా పోయారు. పాఠశాలలు, హాస్టళ్లలో సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వ అదేశాలున్నా కొన్నిచోట్ల దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారనే విమర్శలున్నాయి.కొన్ని చోట్ల బియ్యంతో చెత్తచెదారం వస్తున్నాయంటున్నారు.

మహేశ్వరం మండలంలో రేషన్ దుకాణాలు, కార్డుల వివరాలు

మొత్తం రేషన్ దుకాణాలు	- 47
ఆహార భద్రత కార్డులు	- 15,128
అంత్యోదయ	- 2,657
అన్నపూర్ణ	- 11

ఘనంగా మహా పడిపూజ



ఇబ్రహీంపట్నం: మాజీ ఎంపీ బూరను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని అయ్యప్ప స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చంద్రమోహన్‌నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో మహాపడి పూజ జరిపించారు. ఆలయ చైర్మన్, కౌన్సిలర్ నాయిని సత్యనారాయణతోపాటు నర్సింగ్‌రావు, రవి.. అన్నదానం చేశారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

రావిచేడ్‌లో..

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్‌లో అయ్యప్ప మహా పడిపూజను సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎంపీటీసీ గోపాల్, నాయకులు విఠలయ్యగౌడ్, పారేశ్, రాఘవేందర్, శంకరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పడిపూజలో క్యామ..

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని ఎల్మినేడులో శివకుమార్, శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేష్ హాజరయ్యారు. వేణుగురు స్వామి, రాజు గురుస్వామి, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని చరికొండలో గ్రామ పంచాయతీ నిధులు రూ.25లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను, రూ.5లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులను సర్పంచ్ భారతమ్మతో కలిసి సోమవారం జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందుతేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహగౌడ్, ఉప సర్పంచ్ నరేశ్, లాయక్‌అలీ, జంగయ్య, సాబేర్, అంజి, నర్సింహ, శ్రీను తదితరులు ఉన్నారు.

సబితారెడ్డిని సన్మానించిన పండితులు



సబితారెడ్డిని సన్మానిస్తున్న వేద పండితులు

మహేశ్వరం: మహేశ్వరం ఎమ్మెల్యేగా గెలుపొందిన సబితారెడ్డిని వేద పండితులు, అఘోరా స్వాములు ఘనంగా సన్మానించారు. అలంపూర్ జోగులాంబ ఆలయంలో చండీహోమం, ఆర్‌కేపురంలోని ప్రత్యంగిరా దేవి ఆలయంలో హోమం, పూజలు నిర్వహించి పూజా ఫలాన్ని సబితారెడ్డి ఆమె తనయుడు కార్తీక్‌రెడ్డికి అందజేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు శక్తి, సామర్థ్యాలను అందించాలని దేవుళ్లను వేద పండితులు కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్, శ్రీశైలం దేవస్థానం మౌన స్వామి ఆశ్రమ పీఠాధిపతి శివస్వామి, కిరణ్‌నాథ్‌జీ, అఘోరాస్వామి కాశీ, అనిల్ స్వామి, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: హైదరాబాద్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, టీకేఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం మీర్‌పేటలోని కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఆపదలో ఉన్నవారికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందని, రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎంతోమంది నిరుపేదలకు రక్తాన్ని అందజేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని అభినందించారు. శిబిరంలో సుమారు 300 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కోఆర్డినేటర్ విజయ్, టీకేఆర్ ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి సునీత, ప్రిన్సిపాల్స్ రవిశంకర్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పరుగును ఆపండి



శ్రీరాంకాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంకాలనీ 19వ వార్డులో మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. మురుగునీరు రోడ్డుపైనే పారుతుండటంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. సమస్యను అధికారుల దృష్టి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాలనీలో ఇళ్లు తక్కువగా ఉండటంతో అప్పటి అవసరాలకు అనుగుణంగా పైప్‌లైన్‌ను వేశారు. జనాభా పెరగడంతో పాటు పైప్‌లైన్‌లో వ్యర్థాలను తొలగించకపోవడంతో నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. మురుగు నుంచి దుర్వాసన వెదజల్లడంతో పాటు రోగాలు ప్రబలుతున్నాయి. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

లయన్స్‌క్లబ్ రీజియన్ మాజీ చైర్మన్ చంద్రశేఖర్

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ క్లబ్ మాజీ రీజియన్ చైర్మన్ చంద్రశేఖర్, పీఆర్‌ఓ పాషా కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని చంద్రశేఖర్, పాషా ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 95 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 35 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కోశాధికారి వెంకటయ్య, సభ్యులు.. బాలకృష్ణ, కొండల్‌రెడ్డి, రామ్మోహన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కడ్తాల్‌లో అన్నదానం..

కడ్తాల్: లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని కడ్తాల్ ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ అన్నారు. వెంకట్‌రాజిరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని ఎల్‌సీఎఫ్ కోఆర్డినేటర్ చెన్నకిషన్‌రెడ్డితో కలిసి శివప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, లయన్స్‌క్లబ్ ఆఫ్ జిల్లా చైర్మన్ రమేశ్, క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, క్లబ్ సభ్యులు వెంకటేశ్, బీచ్యానాయక్, జహంగీర్, వెంకటేశ్, మల్లేశ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.